

కబళించిన కరెంట్ తీగ

విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్‌లో చోటు చేసుకుంది. 8లో▸



పేదలందరికీ సంక్షేమ ఫలాలు

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. 8లో▸



అనుమతిని రద్దు చేయాలి

యూనివర్సిటీ పేరుతో విద్యార్థులను మోసం చేసిన గురునానక్ అనుమతి రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

షాద్‌నగర్‌లో టీఎస్‌పీఎస్సీ పరీక్షా కేంద్రాల ఏర్పాటు

షాద్‌నగర్: జూలై 1న నిర్వహించనున్న టీఎస్‌పీఎస్సీ గ్రూప్‌– 4 పరీక్షలకు సంబంధించిన కేంద్రాలను అధికారులు గుర్తించారు. షాద్‌నగర్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, లైజన్ ఆఫీసర్లను నియమించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఠాగూర్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, షాద్‌నగర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, ఉర్దూ మీడియం పాఠశాల, బీఏఎం డిగ్రీ కళాశాల, జీనియస్ గ్రామర్ హైస్కూల్, ఎస్‌వీపీ డిగ్రీ కళాశాల, మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీ సత్యసాయి హై స్కూల్, విశ్వభారతి జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య స్కూల్, నారాయణ టాలెంట్ స్కూల్, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఢిల్లీ వరల్డ్ స్కూల్, మరియా రాణి శాంతి విద్యానికేతన్‌ను ఎంపిక చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

మంచి వక్తకు విషయ పరిజ్ఞానం అవసరం

బీజేపీ నాయకుడు, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఇబ్రహీంపట్నం: మంచి వక్తగా తయారుకావాలంటే విషయ పరిజ్ఞానం ఎంతో అవసరమని దుబ్బాక ఎమ్మెల్యే ఎం. రఘునందన్‌రావు అన్నారు. జ్ఞానసరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినోబానగర్‌లోని సాధన కుటీర్‌లో సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి వక్త శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్తగా తయారుకావాలంటే పుస్తకాలు, దిన పత్రికలను నిత్యం పఠిస్తూ విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. లక్ష్యసాధన కోసం వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలన్నారు. కష్టపడితే ప్రతిఒక్కరూ మంచి వక్తగా ఎదగగలరన్నారు. జీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు సదా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజహితం కోసం పనిచేసే వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, రాజకీయ నాయకులను, ఉపాధ్యాయులను, న్యాయవాదులను, ఉన్నత విద్యనభ్యసిస్తున్న యువతను మంచి వక్తలు తయారు చేయడమే శిక్షణ లక్ష్యమన్నారు. నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ స్పోకెన్ ఇంగ్లిష్ ఆకాడమీ కోచ్ సంజయ్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆనంద్ పాల్గొన్నారు.

ట'మోత'



సనత్‌నగర్: టమాటా ఠారెత్తిస్తోంది. కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తోన్న ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చున్నాయి. రైతుబజార్‌లో కిలో రూ.75 ఉండగా బహిరంగ మార్కెట్లో సెంచరీ దాటేసింది. పంట దిగుబడి భారీగా తగ్గడంతో రోజువారీగా హోల్‌సేల్ మార్కెట్‌కు రావాల్సిన దాని కంటే తగ్గిపోవడంతో ధరలు ఎగబాకుతున్నాయి. ఎర్రగడ్డ రైతుబజార్‌కు రోజువారీగా 200 క్వింటాళ్ల టమాటా వస్తోంది. నాలుగైదు రోజులుగా కేవలం 50–60 క్వింటాళ్లకు పడిపోయింది. రంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ మదనపల్లె, బెంగళూరు నుంచి ఎక్కువగా నగరానికి దిగుమతి అవుతోంది. ప్రస్తుతం టమాటా పంట కోతలు పూర్తయ్యి కొత్త పంట వేశారు. పంట కోతకు రావడానికి మరికొంత సమయం పడుతుంది. అప్పటి వరకు టమాటా ధర మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 18న రైతుబజార్‌లో రూ.39 ఉన్న కిలో టమాటా ధర వారం రోజుల వ్యవధిలోనే రూ.75కు చేరడం గమనార్హం.

ఎయిర్‌పోర్టులో సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్

శంషాబాద్: ప్రయాణికుల కోసం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సదుపాయాలను ఇంతకింతకూ పెంచుతున్నారు. తాజాగా సోమవారం నుంచి సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ సదుపాయాన్ని 9వ గేటు వద్ద ప్రారంభించారు. ఈ సౌలభ్యంతో మరింత సులభమైన ప్రయాణ అనుభూతి కలుగుతుందని సీఈఓ ప్రదీప్ ఫణీకర్ పేర్కొన్నారు. బ్యాగేజ్ చెక్‌–ఇన్ ప్రక్రియ అతి తక్కువ క్షణాల్లో పూర్తవుతుందన్నారు. ప్రయాణికుల సౌలభ్యమే ప్రాధాన్యతగా అనేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కోవిడ్ అనంతరం ఆధునిక సాంకేతిక సేవలను మరింత విస్తృతం చేశామన్నారు.

చేతులు కలిసేనా..?

హస్తం పార్టీలో పోటాపోటీ

- ఎవరికివారుగా కార్యక్రమాలు
- టికెట్ తమకంటే తమకే అంటున్న ఆశావహులు
- అయోమయంలో పార్టీ శ్రేణులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: వరుస ఓటములతో కొంత కాలంగా అచేతన స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక ఎన్నికలు పునరుజ్జీవం పోశాయి. నిరాశ, నిస్పృహలో ఉన్న కేడర్‌లో కొత్త జోష్‌ని నింపాయి. జిల్లా నేతల్లో ఉన్న అనైక్యత, సమన్వయం చేసే సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం ఆ పార్టీకి శాపంగా మారింది. ఎన్నికల ముందు సమన్వయంతో వ్యవహరించాల్సిన నేతలు.. పార్టీలో పై చేయి సాధించేందుకు తహతహలాడుతున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తామంటే..తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. సంస్థాగతంగా పట్టు సాధించేందుకు యత్నిస్తున్నారు. ఇలా ఒకే స్థానం నుంచి ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు బరిలోకి దిగనున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. నేతల తీరుతో కేడర్‌లో అయోమయం నెలకొంది.

ఎల్బీనగర్‌లో ఇద్దరు ఇన్‌చార్జిలు

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలా నిలిచిన ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీ పరిస్థితి విపత్కరంగా మారింది.అప్పటి వరకు నేతల మధ్య అంతర్గతంగా ఉన్న విభేదాలు హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ వేదిక సాక్షిగా బహిర్గతమయ్యా యి. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు రాంరెడ్డి, స్థానిక సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒకే వరలో రెండు కత్తులు అన్నట్లు ఒకే నియోజకవర్గానికి ఇద్దరు నేతలు ఇన్‌చార్జిలుగా ప్రకటించుకుంటున్నారు. ఈ మేరకు ఫ్లెక్సీలు, బ్యానర్లు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. ఇద్దరు నేతల వ్యవహార శైలితో సామాన్య కార్యకర్తలు అయోమయంలో పడ్డారు.

మహేశ్వరంలో ముక్కోణం

మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయబోయేది తానంటే..తానేనని ప్రకటిస్తున్నారు. ఎవరికి వారు వ్యక్తిగతంగా కార్యక్రమాలు రూపొందించుకుని నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు యత్నిస్తున్నారు. ఇక్కడ అధికార బీఆర్ఎస్‌ను, ప్రత్యర్థి బీజేపీని ఢీ కొట్టి నిలబడటం అంత ఆషామాషీ కాదు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఆ పార్టీ అధిష్టానం నుంచి ఇప్పటికీ క్లారిటీ లేదు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. అధికార బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న నేతలు కాంగ్రెస్‌లో చేరి, వారు కూడా టికెట్ ఆశిస్తే .. ఇప్పటి వరకు పార్టీ కోసం అహర్నిషలు పనిచేసినవారి పరిస్థితి ఏమిటనే ప్రశ్న కూడా కేడర్‌లో ఉత్పన్నమవుతోంది.

చేవెళ్లలో చతుర్ముఖం..

చేవెళ్లలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమిపాలైన రత్నం మళ్లీ పోటీకి సిద్ధపడుతున్నారు. సిట్టింగ్ అభ్యర్థికే తిరిగి టికెట్ ఇవ్వనున్నట్లు బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటికే పరోక్షంగా సంకేతాలిచ్చింది. దీంతో రత్నం రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం వసంతం, రాచమల్ల సిద్దేశ్వర్, భీం భరత్, దర్శన్ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. వీరిలో ఎవరో ఒకరికి మాత్రమే టికెట్ దక్కే అవకాశం ఉంది. మిగిలిన వారు పార్టీ కోసం పని చేస్తారా? ఇతర పార్టీల్లో చేరతారా? అనేది అంతు చిక్కడం లేదు. నేతలను సమన్వయం చేసే వారు లేకపోవడంతో ఇక్కడ ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

'పట్నం'లో మూడు గ్రూపులు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పార్టీకి మంచి పట్టు ఉంది. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇక్కడి నుంచి మళ్లీ పోటీ చేయాలని నిర్ణయించుకుని, ఆ మేరకు నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. మరోవైపు దండెం రామిరెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి సైతం తాము కూడా పోటీలో ఉన్నట్లు ప్రకటించుకుంటున్నారు. అధిష్టానం ఆందోళనలకు పిలుపు ఇచ్చిన సమయంలో ఎవరికి వారు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ ఫ్లోర్ లీడర్ భట్టి విక్రమార్క ఇటీవల జిల్లా మీదుగా చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఆయా నేతలంతా నియోజకవర్గంలో బల ప్రదర్శన చేశారు. ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడ్డారు. క్లిష్ట పరిస్థితి నుంచి పార్టీని ఎలా గట్టెక్కించాలనే ఆలోచన ఏ ఒక్క నేతకు లేకపోవడం, కేవలం వ్యక్తిగత ఇమేజ్ కోసమే కార్యక్రమాలు చేస్తుండటాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.



ముచ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నియంత పాలనను తుదముట్టించాలి

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: కేసీఆర్ నియంత పాలనను తుదముట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీకి అందరూ మద్దతుగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ముచ్చర్ల, ఊట్లపల్లిలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో చల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. ఫార్మాసిటీ ఏర్పాటు తర్వాత కాలుష్యంతో ఈ ప్రాంతంలో నివసించలేని స్థితి ఏర్పడుతుందన్నారు. మరోవైపు ఫార్మాసిటీతో భూముల ధరలు పెరుగుతాయని చెప్పి బఫర్‌జోన్ ఏర్పాటు చేయడంతో అమాంతం పడిపోయాయన్నారు. ఫార్మాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు వ్యతిరేకించిన సబితారెడ్డి, ఇప్పుడు ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి తిరిగి రైతులకే భూములు అప్పగిస్తామన్నారు. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ వ్యతిరేక శక్తుల రాజకీయ పునరేకీకరణ జరగాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు డి.నరసింహాచారి, మైనార్టీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అజీజ్, గణేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, జిల్లా నాయకులు ధనుంజయ్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సి.మల్లేష్, నాయకులు నిరంజన్, అజయ్, రాజు, వి.బాబు, మల్లేష్, నర్సింహ, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వినోద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అంగట్లో ఇంజినీరింగ్ సీట్లు

- అందరి దృష్టీ కంప్యూటర్ సైన్స్‌పైనే
- సీఎస్ఈ సీట్లకు పెరిగిన డిమాండ్
- రూ.16 లక్షల నుంచి రూ.30 లక్షలు
- ఇష్టానుసారంగా ఫీజుల పెంపు

సాక్షి, సిటీబ్యూరో: కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్ సీట్లకు డిమాండ్ పెరగడంతో అంగట్లో సరుకుగా అమ్ముడుపోతున్నాయి. రోజురోజుకూ ఫీజుల మోత మోగుతోంది. సివిల్, మెకానికల్ వంటి ఇంజినీరింగ్ కోర్సులు కాకుండా సీఎస్ఈ బ్రాంచ్ వైపే మొగ్గు చూపిస్తుండటంతో ఒకేసారి డిమాండ్ పెరిగినట్లయింది. దీంతో ఇంజినీరింగ్ కళాశాలలు సీఎస్ఈ బ్రాంచ్‌కి ఫీజులు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కౌన్సెలింగ్ షెడ్యూలు ప్రకటించడంతో సీట్ల హడావుడి ప్రారంభమైంది. సీఎస్ఈ కోర్సుపై ఆసక్తి గలవారు కౌన్సెలింగ్ కన్వీనర్ కోటాతో సంబంధం లేకుండా బి కేటగిరీలో సీట్లు దక్కించుకునేందుకు పేరొందిన ఇంజినీరింగ్ కాలేజీలకు క్యూ కడుతున్నారు. ఫలితంగా సీఎస్ఈ నాలుగేళ్ల కోర్సు కలిపి ప్రస్తుతం రూ.16.లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఫీజు పలుకుతోంది. మరోవైపు వసతి ఫీజు అదనంగా ఏడాదికి రూ.1.50 లక్షలు వసూలు చేయడం సర్వసాధారణంగా తయారైంది. ప్రైవేటు కళాశాలలతో పాటు ఇష్టానుసారం బాదేస్తుండగా.. స్వయం ప్రతిపత్తి కళాశాలలు ఏకంగా డొనేషన్ల పేరిట వసూళ్లకు దిగుతున్నాయి. మరోవైపు ఏటా కొంత మొత్తం చెల్లించాలన్న షరతు పెట్టడం మరింత విస్మయానికి గురి చేస్తోంది.

సీఎస్ఈకి తాకిడి

ఇంజినీరింగ్ కాలేజీలకు సీఎస్ఈ సీట్ల తాకిడి పెరిగింది. మెరిట్‌ను బట్టి ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇంటర్మీడియట్‌లో 90% పైగా మార్కులు ఉండాలని, జేఈఈ మెయిన్స్లో 75% మార్కులు వచ్చి ఉండాలనే నిబంధన పెడుతున్నాయి. మెరిట్ లేకపోతే డొనేషన్లను పెంచేస్తున్నాయి. చాలా కళాశాలలు కోర్ ఇంజినీరింగ్, ఐటీ సీట్లను తగ్గించేసుకుని, సీఎస్ఈ సీట్లను పెంచేశాయి. భారీ మొత్తంలో ఫీజులను చెల్లించే ఆర్థిక స్తోమత లేని వారు ఎక్కడో చోట కన్వీనర్ కోటాలో వచ్చిన సీటులో చేరిపోదామని నిర్ణయించుకుంటున్నారు. వాస్తవంగా కోర్ ఇంజినీరింగ్ సివిల్, మెకానికల్, లాంటి వాటిలో పెద్దగా ఉద్యోగావకాశాలు లేకపోవడంతో విద్యార్థులందరూ సాఫ్ట్‌వేర్ బాటపడుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే.. బి కేటగిరీ కింద సగానికిపైగా..

నగర పరిధిలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో బి కేటగిరీ కింద ఇప్పటికే సగానికి పైగా సీట్లు భర్తీ అయినట్లు తెలుస్తోంది.ఏకంగా కొన్ని కళాశాలలు సీఎస్ఈ సీట్లు పూర్తయినట్లు స్పష్టం చేస్తున్నాయి. జేఎన్టీ యూ పరిధిలోనే 149 కాలేజీలుండగా ప్రైవేటు కాలేజీల్లో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటా (ఎ కేటగిరీ) ద్వారా.. మిగిలిన 30 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా (బి కేటగిరీ)లో ద్వారా భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. కన్వీనర్ కోటా పూర్తయిన తర్వాత మేనేజ్‌మెంట్ కోటాను భర్తీ చేయాలని కానీ కన్వీనర్ కోటాప్రక్రియ కంటే ముందే మీ కేటగిరి సీట్లు అంగట్లో సరుకుగా అమ్ముడుపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



ఫిర్యాదులు చేసేందుకు క్యూకట్టిన జనం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఫిర్యాదు దారులతో సమావేశ మందిరం కిక్కిరిసిపోయింది. గత వారం ప్రజావాణి జరగకపోవడంతో ఒకేసారి 330 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి శాకంబరి ఉత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ తల్లి శాకంబరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం సప్తశతి పారాయణం, వేద పారాయణం, రుద్రాభిషేకాలు, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన పూజలను నిర్వహించారు. సాయంత్రం అనుష్ఠానహోమాలు, రాత్రి పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తి పల్లకీ సేవ వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి. నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

గులాబీకి షాక్!

- బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరిన కప్పాటి, కొత్త
- ఏఐసీసీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ సమక్షంలో..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల వేళ గులాబీ పార్టీకి షాక్ తగిలింది. ఇరువురు కీలక నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడం మహేశ్వరం బీఆర్ఎస్ శిబిరాన్ని ఆత్మరక్షణలో పడేసింది. గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, గతంలో టీఆర్ఎస్ తరుపున పోటీ చేసి ఓడిపోయిన కొత్త మనోహర్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ గూటికి చేరారు. కందుకూరు మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి పార్టీని వీడారు. తెలంగాణ ఉద్యమ కారుడిగా మహేశ్వరం ప్రజలకు ఆయన సుపరిచితుడు. తెలంగాణ ఉద్యమ కారులకు ఆయన స్ఫూర్తి. పన్నెండేళ్లుగా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. అయితే కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఆ తర్వాత అధికార పార్టీలో చేరి, ఆ తర్వాత మంత్రి పదవి దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆయనకు మధ్య కొంతకాలంగా పొసగడం లేదు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న తనకు చైర్మన్ పదవిని పొడిగించకుండా మంత్రి అడ్డు తగిలినట్లు ఆయన గతంలోనే బహిరంగా ఆరోపించారు.

కొత్త కూడా..

జిల్లెలగూడకు చెందిన కొత్త మనోహర్‌రెడ్డి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆరు నెలల ముందు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. 2014లో బీఆర్ఎస్ తరపున మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.40 వేలకుపైగా ఓట్లు సాధించి ఓటమిపాలైనప్పటికీ..అప్పటి నుంచి ఇప్పటి వరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ వచ్చారు.2018ఎన్నికల్లోనూ టికెట్ ఆశించారు.పోటీకి సన్నద్ధమవుతున్న సమయంలోనే మాజీ ఎమ్మెల్యే టీకేఆర్ టీడీపీని వీడి టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.దీంతో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బుజ్జగించడంతో పోటీ నుంచి ఆయన వెనక్కి తగ్గారు. ఎమ్మెల్సీ టికెట్ ఆశించి భంగపడ్డారు. మంత్రి, అనుచరులు చేస్తున్న భూకబ్జాలు,అవినీతిపై ఆయన పలు మార్లు బహిరంగంగానే విమర్శలు సంధించారు. కొంతకాలంగా పార్టీ అధికార కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కేఎంఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజల మధ్యనే ఉంటున్నారు.



రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేతో నేతలు

చైతన్యం.. శూన్యం

- సాగుకు సన్నద్ధం అవుతున్న అన్నదాతలు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుపై తర్జనభర్జన
- అవగాహన కల్పించని అధికారులు



విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు

షాద్‌నగర్ : వర్షాకాలం పంటల సాగు కోసం అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఏ విత్తనాలు కొనాలి, ఏ ఎరువులు వాడాలి, సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై ప్రభుత్వం రైతులను చైతన్య పర్చాల్సి ఉంది. గతంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏప్రిల్, మే నెలలో చైతన్యయాత్రల పేరిట ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించేవారు. పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులు, పురుగులు, ఎరువుల మందల వాడకం, విత్తనాలు, కొనుగోళ్లలో జాగ్రత్తలు వివరించేవారు. పంటల సాగుపై అందరూ కలిసి ఓచోట చర్చించుకునేందుకు వీలుగా ప్రభుత్వం గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించింది. వర్షాకాలం పంటల సాగుపై, భూసార పరీక్షల ఆవశ్యకత, పంటల మార్పిడి, రుణాలు ఏవిధంగా పొందాలి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఏవిధంగా పొందాలి, పంటలకు వచ్చే చీడ పీడల నివారణ, పశు సంపద అభివృద్ధి, పాడిపరిశ్రమ అందిస్తున్న రాయితీలు, విత్తనోత్పత్తి ప్రోత్సాహం తదితర విషయాలపై అవగాహన కల్పించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గతంలో వ్యవసాయ శాఖతో పాటు 12 అనుబంధ శాఖల అధికారులు గ్రామాలతో కలిసి మన తెలంగాణ మన వ్యవసాయం పేరుతో చైతన్య యాత్రలు నిర్వహించేవారు. పంటల సాగులో వచ్చే ఇబ్బందులు, సమస్యలను రైతులు సమావేశాల్లో అధికారుల దృష్టికి తెస్తే వెంటనే నివృత్తి చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

మార్కెట్‌లో నకిలీ బెడద

మార్కెట్‌లో నకిలీ విత్తనాలను వ్యాపారులు జోరుగా విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులను అరికట్టేందుకు ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. రైతులు నకిలీ బారిన పడకుండా చర్యలు తీసుకోవడం అధికారులకు సవాలుగా మారింది. ఇటీవల ఫర్టిలైజర్, విత్తనాల తయారీ కేంద్రాలు, పురుగులు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో తూతూ మంత్రంగానే తనిఖీలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

అవగాహన కల్పించాలి



కొత్త రకం వంగడాలు, కొత్త పద్ధతులు ఏవి వచ్చాయో తెలియజేయాలి. పంటల సాగుపై మెలకువలు తెలిపితే లాభదాయకంగా ఉంటుంది. ఎరువులు, విత్తనాల కొనుగోలుపై అవగాహన లేక ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు చెప్పిందే కొనాల్సి వస్తోంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, ముట్పూరు, కొందుర్గు

నష్టపోయే ప్రమాదం



మార్కెట్‌లో ఏవి అసలు, ఏవి నకిలీ అనేవి రైతులకు తెలుసుకోవడం కష్టం. తద్వార రైతులు దళారులకు ఆకర్షితులై నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులను అప్రమత్తం చేయడంతోపాటు, వారిని చైతన్య పరిచే బాధ్యత అధికారులపై ఉంది.

– బిజ్జ ప్రభు, షాద్‌నగర్

జాగ్రత్తలు తీసుకోవాలి



విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ బారిన పడకుండా వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు తప్పనిసరి రసీదు పొందాలి.

– రాజారత్నం, ఏడీ, షాద్‌నగర్

జూలై 10లోపు డైట్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: జూలై 10వ తేదీ లోపు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని వికారాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–23 బ్యాచ్ డీఎడ్ ద్వితీయ సంవత్సరం శిక్షణార్థులు ఆగస్టు,సెప్టెంబర్ 2023లో జరగబోయే వార్షిక పరీక్షలు రాసే రెగ్యులర్ , గతంలో ఫైల్ అయిన విద్యార్థులు ఫీజు చెల్లించాలని కోరారు. రూ.50 అదనపు ఆలస్య ఫీజుతో జూలై 18వ తేదీ లోగా చెల్లించాలని చెప్పారు. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 శిక్షణార్థులు చదువుతున్న సంస్థల్లో రెండు ఫొటోలతో పాటు ఫైల్ అయిన మెమో జత చేసి చెల్లించాలని వివరించారు.

కబళించిన కరెంట్ తీగ

- విద్యుదాఘాతానికి యువకుడు మృతి
- మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన
- విద్యుత్ శాఖ అధికారుల హామీతో ఆందోళన విరమణ



మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



జహంగీర్

కడ్తాల్: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి ఆరీఫ్, సాబేరా దంపతుల చిన్నకుమారుడు జహంగీర్(28) తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ.. వ్యవసాయం, గేదెల పెంపకం, పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు రోజు మాదిరిగానే జహంగీర్ గేదెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లాడు. గడ్డివాము వద్దకు కొన్ని గేదెలు వెళ్లగా, వాటిని తప్పించే క్రమంలో సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరును తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

మృతదేహంతో ఆందోళన

జహంగీర్ మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. మృతదేహాన్ని సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి షాద్‌నగర్-కడ్తాల్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. లైన్‌మన్, హెల్పర్‌లను వెంటనే తొలగించాలని, ఏఈపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఆమనగల్లు సీఐ ఉపేందర్.. ఏఈ శ్రీనివాస్, ఏఈ నరేందర్‌తో ఫోన్లో మాట్లాడి వారిని రావిచేడ్‌కు రప్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, లైన్‌మన్‌పై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పరంగా రూ.5 లక్షలు సాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా కొంత నగదును కూడా అందించారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తుక్కు డబ్బుల గొడవతోనే..

గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ



పోలీసుల అదుపులో నిందితుడు

శంషాబాద్: తుక్కు సామాన్లు విక్రయించిన డబ్బుల పంపకంలో జరిగిన గొడవే కొత్తూరులో చోటు చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి(55) హత్యకు కారణంగా తేలింది. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం, రాయచూర్‌కు చెందిన తెలుగు నాగప్ప ఇరవై రోజుల కిందట కాచిగూడకు వచ్చి అక్కడే నివాసముంటున్నాడు. ఇనుప సామాన్లు, తుక్కు ఏరుకుని వాటిని విక్రయించేవాడు. ఈ నెల 23న రాత్రి అతడికి కొత్తూరులో గుర్తు తెలియని వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి చేగూరు సమీపంలోని స్క్రాప్ దుకాణంలో తాము సేకరించిన తుక్కును విక్రయించారు. డబ్బుల పంపకం విషయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. అప్పటికే ఇద్దరు మద్యం మత్తులో ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తి నాగప్పను కట్టెతో కొట్టడమేగాక డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత కొత్తూరు సమీపంలోని మెగాఫ్లోర్ మిల్ వద్ద అతను మరోమారు నాగప్పపై కర్రతో దాడి చేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన నాగప్ప అతడి వద్ద ఉన్న కర్ర లాక్కుని చితకబాదాడు. అనంతరం తలపై రాయితో మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ ఏసీపీ భాస్కర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు ఆదివారం రాత్రి శంషాబాద్ పాలమాకుల వద్ద అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా మృతుడి వివరాలు గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

జర్నలిస్టులకు విద్యాశాఖ శుభవార్త

స్కూల్ ఫీజుల్లో 50% రాయితీ ఇస్తూ ఉత్తర్వులు జారీ



శ్రీకాంత్‌రెడ్డికి ఉత్తర్వులను అందజేస్తున్న డీఈఓ

హుడాకాంప్లెక్స్: రంగారెడ్డి జిల్లా జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ విద్యాలయాల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే –ఐజేయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లు డీఈఓలతో చర్చించి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల తగ్గింపునకు కృషి చేయాలని ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించి ఉత్తర్వులను శ్రీకాంత్‌రెడ్డికి అందజేశారు.

ప్రతి పేదోడికి సంక్షేమ ఫలాలు

మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్



పథకాల గురించి వివరిస్తున్న నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల మోదీ ప్రభుత్వం అందించిన ఫలాలు దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. ప్రతి పేదోడికి సంక్షేమ ఫలాలు అందాయని పేర్కొన్నారు. ఉచిత రేషన్ బియ్యం, కరోనా వ్యాక్సిన్ ఉచితంగా వేసినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.11 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమా చేసినట్లు వివరించారు. యువత స్వశక్తిపై ముందుకు వెళ్లాలని, ఎలాంటి పూచికత్తు లేకుండా అర్హత ఉన్న వారికి ముద్రరుణం పొందవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఐదు లక్షల వరకు వైద్యం అందిస్తుందన్నారు. మహిళలు. పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని ఆయన వివరించారు. అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న బీజేపీ సర్కార్ తీరును ప్రపంచ దేశాలు మెచ్చుకుంటున్నాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ నారాయణయాదవ్, శ్రీశైలం, మున్సిపాలిటీ అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, గీతసెల్ కన్వీనర్ లక్ష్మీపతిగౌడ్, ఆశోక్‌గౌడ్, సతీష్‌గౌడ్, ఈశ్వర్, శిగ ప్రభాకర్‌గౌడ్, నరేందర్‌చారీ, గణేష్‌లతో పాటు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ
- గురునానక్ కళాశాల తీరుపై మండిపడ్డ నేతలు.. పలువురి అరెస్టు



ఝాన్సీని అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ హెచ్చరించారు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అనుమతి లేకున్న విద్యార్థులను చేర్చుకొని మోసం చేసిన అంశంపై సోమవారం ఏబీవీపీ మీడియా సమావేశం నిర్వహించింది. అనంతరం గురునానక్ కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తారేమోనన్న అనుమానంతో ఏబీవీపీ నేతలను బలవంతంగా అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులకు న్యాయం చేయాల్సింది పోయి, అన్యాయాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాల నేతలపై తప్పుడు కేసులు బనాయించడంపై మండిపడ్డారు. అధికార పార్టీ అండదండలతో విద్యా వ్యాపారం చేస్తున్న గురునానక్ యాజమాన్యాన్ని వదిలిపెట్టేదేలేదన్నారు. ఈ విద్యాసంస్థ గుర్తింపును రద్దు చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ హైదరాబాద్ సెక్రటరీ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ సంజీవరెడ్డి, జిల్లా కన్వీనర్ సాయిధనరాజ్, శివకృష్ణ, సందీప్, జగదీశ్, పవన్, శ్రీకాంత్‌లున్నారు.

ప్రజాచైతన్య సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీపతి



శ్రీపతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న నర్సింహులు

షాబాద్: తెలంగాణ ప్రజా చైతన్య సమితి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా పర్వేద శ్రీపతిని నియమించినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీపతి మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు.

పుస్తెల తాడు దొంగలకు రిమాండ్

శంకర్‌పల్లి: మహిళ మెడలోంచి పుస్తెల తాడును లాక్కొని పరిగెత్తుతున్న దొంగలను స్థానికులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సోమవారం శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం, కోనాపూర్‌కు చెందిన సునంద ఆదివారం శంకర్‌పల్లిలోని కూరగాయాల మార్కెట్‌కు వచ్చింది. ఆందోల్ మండలం, రామ్సన్ పల్లికి చెందిన రవీందర్ (30), శివయ్య(35)లు ప్లాన్ ప్రకారం శివయ్య బైక్ నడుపుతుండగా రవీందర్ మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కొని పరుగులు తీశాడు. గమనించిన స్థానికులు రవీందర్‌ను పట్టుకోగా, శివయ్య బైక్‌పై పారిపోయాడు. దీంతో సోమవారం ఉదయం శివయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు మూడు తులాల పుస్తెల తాడు, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆస్తి పంపకాల్లో వివాదం

ఘర్షణలో బావ మృతి



జగన్ గౌడ్ (ఫైల్)

మహేశ్వరం: ఆస్తి పంపకాల విషయంలో బావ, బామ్మర్ది మధ్య జరిగిన ఘర్షణలో బావ మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మండలంలోని కల్వకోల్‌లో చోటు చేసుకుంది. సీఐ ముని కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండకు చెందిన మెట్టు జగన్ గౌడ్(47), మహేశ్వరం మండలం కల్వకోల్‌కు చెందిన రామకృష్ణాగౌడ్ అలియాస్ రవిగౌడ్ ఇద్దరు బావబామ్మర్దులు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఒక కార్యక్రమం అనంతరం రామకృష్ణాగౌడ్ అక్కలు, బావలు, ఇతర బంధువులు ఒకే చోట కూర్చొని ఆస్తి పంపకాల గురించి మాట్లాడుతుండగా బావ జగన్‌గౌడ్, బామ్మర్ది రామకృష్ణాగౌడ్‌ల మధ్య మాటామాట పెరిగి కోపంతో రామకృష్ణాగౌడ్ బావ జగన్‌గౌడ్‌ను బలంగా కొట్టడంతో స్పృహ కోల్పోయి వాంతులు చేసుకుంటూ పడిపోయాడు. వెంటనే జగన్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జగన్‌గౌడ్ గతకొన్ని సంవత్సరాల నుంచి కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ డయాలసిస్ చికిత్స తీసుకుంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన సుంకిరెడ్డి



సుంకిరెడ్డి

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల సమక్షంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి గతేడాది కాలంగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి, మాడ్గుల మండల కేంద్రాలలో ఐక్యత ఫౌండేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేసిన సుంకిరెడ్డి.. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. త్వరలో జరిగే శాసనసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది.

సుంకిరెడ్డి అభిమానుల సంబరాలు

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆమనగల్లులో ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఎన్ని కుట్రలు పన్నినా గెలిచేది బీఆర్ఎస్సే



బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్, బీజేపీ లు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మహేశ్వరంలో అంతిమంగా గెలిచేది బీఆర్ఎస్ పార్టీనేనని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సిరిగిరిపురానికి చెందిన బీజేపీ నాయకులు బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సబితారెడ్డి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన బీజేపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి మతతత్వ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మహేశ్వరం గడ్డపైన గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో శ్రీను, రాఘవేందర్ గౌడ్, గోపాల్, అనిల్, శ్యామ్ చేరారు.

'గురునానక్' అనుమతిని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

- రోడ్డుపై బైఠాయింపు, రాస్తారోకో
- ఆందోళనకారుల అరెస్టు



ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ పేరుతో విద్యార్థులను మోసం చేసిన గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల అనుమతిని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై బైఠాయించారు. అనంతరం రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ అనుమతి రాకున్నా ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.3 లక్షల చొప్పున డొనేషన్లు తీసుకొని వంద కోట్ల రూపాయలు వసూలు చేసిందని ఆరోపించారు. సుమారు 3,500 మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన గురునానక్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఇందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. జెఎన్‌టీయూకు అటాచ్ చేసి విద్యాసంవత్సరం నష్టపోకుండా విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రాస్తారోకోతో ట్రాఫిక్ జామ్

హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంతో వందలాది వాహనాలు రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అటంకం కలిగింది. సుమారు కిలోమీటర్ల పొడువున రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడంతో పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పే యత్నం చేశారు. చివరకు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, ఉపాధ్యక్షులు మస్కు చరణ్‌తోపాటు సిద్ధు, తరంగ్, శ్రీకాంత్, విప్లవ కుమార్, వంశీ, శివ, సుమంత్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

మేకల మందపై కుక్కల దాడి

14 జీవాలు మృతి

షాబాద్: మేకల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 14 జీవాలు మృతి చెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని నాగర్‌కుంటలో చోటు చేసుకుంది. పశువైద్యాధికారి స్రవంతి తెలిపిన ప్రకారం.. నాగర్‌కుంట గ్రామానికి చెందిన కొత్త కురువ నర్సింలు ఆదివారం సాయంత్రం మేకల మందను పొలం వద్ద ఉంచి ఇంటికి వచ్చారు. రాత్రి ఆ మందపై కుక్కలు దాడి చేయడంతో 14 మేకలు మృతి చెందగా మరో 10 తీవ్రంగా గాయపడ్డాయి. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి గమనించిన రైతు మేకల కళేబరాలను చూసి బోరున విలపించాడు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి ఘటనా స్థలికి చేరకుని పంచానామా నిర్వహించారు. కాగా ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.



పంచనామా చేస్తున్న డాక్టర్ స్రవంతి